క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్ల చోరీ



చిడిపి గ్రామంలో చోరీకి పాల్పడిన ట్రాన్స్‌ఫార్మర్

కొవ్వూరు: చిడిపి గ్రామంలోని పామెర్ల నగేష్‌కుమార్ అనే రైతు పొలంలోని వ్యవసాయ పంపు సెట్‌లోని 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి అందులోని రాగి వైర్లను దుండగులు అపహరించుకుపోయారు. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ చోరీపై కొవ్వూరు రూరల్ పోలీసులు, ట్రాన్స్‌కో రూరల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఆ రైతు తెలిపారు. తక్షణమే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించి సరఫరా అందించాలని ఆయన కోరుతున్నారు. ఇటీవల పశివేదల, ధర్మవరం గ్రామాల్లోనూ దుండగులు ఇదే తరహాలో ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి రాగి వైర్ల చోరీకి పాల్పడ్డారు.

సరిహద్దు వివాదంలో ఏడుగురిపై కేసు

నిడదవోలు రూరల్: ఇళ్లస్థలాల సరిహద్దు వివాదంలో మండలంలోని కోరుపల్లి గ్రామంలో ఇరు వర్గాలకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ ఆదివారం తెలిపారు. కోరుపల్లికి చెందిన కారింకి బంగారమ్మ, మిద్దే వెంకటలక్ష్మి వర్గాల తరపున ఏడుగురు వ్యక్తులు గొడవ పడ్డారు.దీనిపై వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కోటసత్తెమ్మ వారికి బోనాల సమర్పణ

నిడదవోలు రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన శ్రీ కోటసత్తెమ్మ వారికి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన 62 మంది భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకుడు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

30న వాహనాల బహిరంగ వేలం

దేవరపల్లి: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలకు ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్టు ఎస్సై పి.సుధీర్ తెలిపారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డుతో పాటు రూ. 5 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. పాటదక్కించుకున్న వారు అదే రోజు వేలం సొమ్ముతో పాటు జీఎస్టీ కలిపి చెల్లించాలనితెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థినులు

చాగల్లు: రాష్ట్రస్థాయి అండర్ -13 బాలికల ఫుట్‌బాల్ పోటీలకు చాగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు 11 మంది ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు పి.వీరాజు తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకూ తిరుపతిలో నిర్వహించే పోటీల్లో వారంతా పాల్గొంటారని తెలిపారు. జూన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 11 మంది విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వివరించారు. ఎంపికైన క్రీడాకారిణులకు మీనానగరానికి చెందిన ఎండీ నఫీజ్, డాక్టర్ ప్రమీల చిన్నారావు దంపతులు ఆర్థిక సహాయం చేసినట్టు హెచ్ఎం తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

గోపాలపురం: మండలంలోని భీమోలు గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై గోపాలపురం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి 12 మోటార్ సైకిళ్లను, రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

శాకంబరిగా ఆర్లమ్మ వారు



అమ్మవారు

చాగల్లు: కలవలపల్లి గ్రామదేవత ఆర్లమ్మ వారికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి చీరసారెలు, డప్పు వాయిద్యాలతో భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

వరదల వేళ .. టెండర్ల గోల

- గోదావరికి పొంచి ఉన్న వరద ముప్పు
- ఫ్లడ్ స్టోరేజీల్లో నిండుకుంటున్న సామగ్రి
- సామగ్రి సరఫరాకు టెండర్లు పిలిచిన అధికారులు
- మూతబడిన కాకరపర్రు, ప్రక్కిలంక ఫ్లడ్ స్టోర్స్
- కొవ్వూరు స్టోర్‌లో అరకొరగా సామగ్రి



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి(ఫైల్)



వరదకు పెరవలి మండలం కాకరపర్రులో నీట మునిగిన అరటితోట (ఫైల్)

కొవ్వూరు: గోదావరికి జూలై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకూ వరదల సీజన్. ఈ విపత్తును ఎదుర్కొనేందుకు అవసరమైన సామగ్రితో ఫ్లడ్ స్టోర్స్‌ను జలవనరుల శాఖ నెల రోజుల ముందుగానే సిద్ధం చేసుకోవాలి. అఖండ గోదావరి నదీ తీరంలోని ప్రక్కిలంక శాశ్వత ఫ్లడ్ స్టోర్ మూలన పడింది. సెంట్రల్ ఫ్లడ్ స్టోర్ అయిన పెరవలి మండలంలోని కాకరపర్రు స్టోర్‌దీ అదే పరిస్థితి. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రస్తుతం కొవ్వూరు ఫ్లడ్‌స్టోర్ మాత్రమే ఉంది. ఇక్కడ కూడా అవసరమైన సామగ్రి అరకొరగానే ఉంది. ఎక్కడ గోదావరి ఏటి గట్లు బలహీనంగా ఉన్నా, ప్రమాదం పొంచి ఉన్నా నష్ట నివారణ చర్యలు తీసుకోవడంలో ఈ ఫ్లడ్ స్టోర్స్‌దే కీలక పాత్ర. అలాంటి ఫ్లడ్ స్టోర్స్‌పై ఇంత వరకూ ప్రభుత్వం దృష్టి సారించక పోవడం విమర్శలకు తావిస్తుంది.

గడువు ముంచుకొచ్చాక టెండర్లు

మూడు రోజులుగా గోదావరిలో వరద క్రమంగా పెరుగుతోంది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో జనం అతలాకుతలం అవుతున్నారు. ఇప్ప టికే గోదావరిలో 7.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. ఎగువన నీటి మట్టాలు క్రమంగా పెరుగుతున్నాయి. గోదావరి క్యాచ్‌మెంట్ ఏరియయాలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రానున్న రోజుల్లో ఈ వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ఇంతవరకూ ఫ్లడ్ స్టోర్స్‌కు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోలేదు. రూ.6.50 లక్షల విలువైన ఫ్లడ్ సామగ్రి సరఫరాకు ఇరిగేషన్‌శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. ఎక్కడైనా ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రదేశాన్ని పటిష్ఠ పరిచేందుకు వినియోగించేందుకు ఐదు వేల ఇసుక బస్తాలు, 150 క్యూబిక్ మీటర్ల ఇసుక, వెయ్యి వెదురు గెడలు, 900 సర్వే బాదులతో పాటు ఇతర సామగ్రి సరఫరాకు ఈ టెండర్ పిలిచారు.ఈ టెండర్ ఖరారు కావడానికి మరింత సమయం పడుతుంది. అవసరమైన సామగ్రి సరఫరా అయ్యే లోగా ఫ్లడ్ సీజన్ ముగిసేలా ఉంది. ఒకవేళ గోదావరికి భారీగా వరదొస్తే ఇబ్బందులు తప్పేలా లేవు.

గత రెండేళ్లూ భారీగా వరదలు

గత రెండేళ్ల ఫ్లడ్ గణాంకాలను పరిశీలిస్తే గోదావరికి భారీగానే వరదలు వచ్చాయి. ప్రభుత్వం మాత్రం ఫ్లడ్ స్టోర్స్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా ఉంది. ఇంతవరకూ వరదపై క్షేత్రస్థాయి అధికారులకు సరైన దిశానిర్దేశమే చేయలేదు. గతే డాది జూలై 20న గోదావరి వరద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరింది. 30న రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి గరిష్ఠంగా 16,32,700 క్యూసెక్కుల వరద నీరొచ్చింది. 2022 జూలై 15న మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి వరద ప్రవహించింది. అప్పట్లో 19.23 లక్షల క్యూసెక్కుల వరదొచ్చింది. 17వ తేదీ నాటికి గరిష్ఠంగా 25.77 లక్షల క్యూసెక్కుల వరదొచ్చింది. ఈ స్థాయిలో వరద ఈ ఏడాది కూడా వస్తే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

29 తీర గ్రామాలు

కొవ్వూరు డివిజన్‌లో అఖండ గోదావరి, వశిష్ఠ గోదావరి నదీ తీరాలు సుమారు ఆరవై కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్నాయి. కొవ్వూరు మున్సిపాలిటీతో పాటు 29 గ్రామాలు తీరం వెంబడి ఉన్నాయి. భారీగా వరదొస్తే ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఒడిదుడులు ఎదుర్కొంటున్నారు. అఖండ గోదావరి నదీ తీరం పోలవరం నుంచి విజ్జేశ్వరం బ్యారేజీ వరకూ 41.80 కిలోమీటర్ల పొడవునా ఉంది. జిల్లా పరిధిని మినహాయిస్తే కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో తాళ్లపూడి మండలం తాడిపూడి నుంచి సుమారు 30 కిలోమీటర్ల పొడవునా అఖండ గోదావరి విస్తరించింది. కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లోని 12 గ్రామాలతో పాటు కొవ్వూరు మున్సిపాలిటీ కూడా నదిని ఆనుకునే ఉన్నాయి. విజ్జేశ్వరం ఆనకట్ట వద్ద నుంచి పెరవలి మండలంలోని కడింపాడు వరకూ 30 కిలోమీటర్ల పొడవునా గోదావరి విస్తరించి ఉంది. నిడదవోలు, పెరవలి మండలాల్లో నదీ తీరం వెంబడి 17 గ్రామాలున్నాయి. ఏటా వరదల వేళ వశిష్ఠ గోదావరి తీరం వాసులు బిక్కుబిక్కుమంటూ కాలక్షేపం చేస్తారు. నదిని ఆనుకుని పలుచోట్ల ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేయడంతో ఎక్కడికక్కడ ఏటిగట్లు ధ్వంసం అయ్యాయి. దీంతో గోదావరికి భారీ వరదలొస్తే పెను ప్రమాదం తప్పదని తీర ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు.

> **ఫ్లడ్ సామగ్రి కోసం టెండర్లు పిలిచాం**
>
> 
>
> కొవ్వూరు ఫ్లడ్ స్టోర్‌లో ప్రస్తుతం 500 క్యూబిక్ మీటర్ల ఇసుక,1,100 వెదురు కర్రలు, వెయ్యి సర్వే బాదులు, 44 వేల బస్తాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత ఫ్లడ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సామగ్రి కోసం షార్ట్ టెండర్లను పిలిచారు. మొదటి సారి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకూ రాలేదు. ఇటీవలే మళ్లీ టెండర్లు పిలిచారు.
>
> –ఆర్.సునీల్‌బాబు, ఏఈ, అఖండ గోదావరి రివర్ బ్యాంక్

రోడ్డుకు రక్షణగా ఇసుక బస్తాలు

- ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశం
- ముంపు బారిన పడిన పంటల పరిశీలన



గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గోపాలపురం: వరద ప్రభావిత ప్రాంతాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలను ఆదివారం ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పంట ముంపు ప్రాంతాల్లో నీటిని యుద్ధ ప్రాతిపదికన బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. కొవ్వాడ కాలువ నీటి ప్రవాహానికి రోడ్లు పాడవకుండా ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ డి.వనజాక్షిని ఆదేశించారు. వరద ముంపునకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారంతో పాటు సబ్సిడీ, ఇన్‌పుట్ సబ్సిడీ కింద విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని వ్యవశాయ శాఖ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, కొవ్వూరు ఏడీఏ పి. చంద్రశేఖర్, ఏవో బి.రాజారావు రైతులు పాల్గొన్నారు.

కోతకు గురైన వరద గట్టు

ఇసుక బస్తాలతో తాత్కాలిక రక్షణ



ఇసుక బస్తాలతో గట్టు వేస్తున్న రైతులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం. చిత్రంలో ఎమ్మెల్యే వెంకట్రాజు



పోతవరం ఎర్రకాలువ వంతెన వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మాధురి

నల్లజర్ల: మండలంలోని గుండేపల్లి వద్ద ఎర్ర కాలువ గట్టు కోతకు గురైంది. వరద ఉధృతికి ఈ గ్రామంలోని పెన్మత్స శ్రీహరిరాజు అనే రైతు పొలం వద్ద 100 మీటర్ల పొడవునా గట్టు కోతకు గురైంది. 1986లో వచ్చిన వరద ఉధృతికి గుండేపల్లి గ్రామమంతా మునిగి ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. ఈ గట్టును పటిష్ఠ పరచకపోతే మరోసారి ఎర్ర కాలువకు వరదొస్తే గుండేపల్లి గ్రామం మొత్తం ముంపునకు గురవుతుంది. ఈ విషయాన్ని రైతులు ఆదివారం ఆ గ్రామానికి వచ్చిన కొవ్వూరు సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ్‌కు, మండల వరద పర్యవేక్షణాధికారి, గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.మాధురి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, తహసీల్దార్ కృష్ణారావు తదితరులకు రైతులు వివరించారు. యుద్ధ ప్రాతిపదిక ఇసుక బస్తాలతో తాత్కాలిక గట్టు ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దారు కృష్ణారావు తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో పాటు ఉపాధి కూలీలు, రైతులు ఉన్నమట్ల శ్రీనివాస్, సూర్యచంద్రరావు, మండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి ప్రత్యేకాధికారిగా మాధురి

వరద, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు నల్లజర్ల మండలానికి ప్రత్యేకాధికారిగా గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. మాధురిని ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు చేపట్టిన ఆమె ఆదివారం మండలంలో వివిధ గ్రామాల్లో పర్యటించారు. పోతవరం, నబీపేట గ్రామాల్లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అనంతపల్లిలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ పి.కృష్ణారావు కూడా ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి



తాళ్లపూడిలో సాయిబాబాకు భక్తుల అభిషేకం



ఉండ్రాజవరం మండలం పాలంగిలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

తాళ్లపూడి: ఆదివారం గురు పౌర్ణమి కావడంతో ఉదయం నుంచి సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తాళ్లపూడి, పెద్దేవం, వేగేశ్వరపురం, గజ్జరం, అన్నదేవరపేటల్లోని ఆలయాల్లో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఉండ్రాజవరం: గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం పాలంగి గ్రామంలోని షిర్డీసాయి ప్రశాంతి ఆశ్రమంలో బాబాకు విశేష పంచామృతాభిషేకాలతో పాటు 108 మంది సాయి భక్తులచే సాయిసత్య వ్రతం నిర్వహించారు. ఉండ్రాజవరంలో అర్చకుడు దోసేపూడి సుధాకర్ ఆధ్వర్యంలో అభిషేకాలు, సహస్ర నామ తులసీ పూజలు నిర్వహించారు. వేలివెన్నులో బాబాను పల్లకీలో ఊరేగించి, ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన చేశారు.

నల్లజర్ల: అనంతపల్లిలోని షిర్డీసాయికి ఐదు రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. ఫిన్లాండ్‌లో స్థిర పడిన స్థానికులు కంచర్ల నాగవెంకట సత్యనారాయణ, లక్ష్మీ మంజూష దంపతులు పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మందికి అన్నదానం నిర్వహించారు.

దేవరపల్లి: స్థానిక షిర్డీ సాయిబాబాకు 108 ఆవు పాలు, 108 లీటర్ల పవిత్ర గోదావరి జలాలతో అష్టోత్తర కలశాభిషేకం, లక్ష తు లసి పూజ నిర్వహించారు. 108 రకాల పిండి వంటలతో బాబాకు ప్రత్యేక నివేదన, పంచ హారతులు సమర్పించారు. ప్రసాద వితరణ, అన్నసమారాధన జరిగాయి.

గోపాలపురం: షిర్డీ సాయి ఆలయంలో ధర్మకర్త కూసం రామమోహన్ రెడ్డి, పోతుల అప్పిరెడ్డి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచామృతా భిషేకాలు నిర్వహించారు. చిట్యాల, దొండపూడి, వెదుళ్లకుంట, గంగోలు సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

చాగల్లు: స్థానిక షిర్డీ సాయిబాబా, దత్తసాయి మందిరాల్లో పంచామృత క్షీరాభిషేకం నిర్వహించారు. బ్రాహ్మణగూడెం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలకరించారు. గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. అన్నసమారాధన నిర్వహించారు. చాగల్లు, ఊనగట్ల తదితర గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి పూజలు జరిగాయి.

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందర సాయి ఆలయం, వేములూరు, ఐ.పంగిడి తదితర గ్రామాల్లో బాబాకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.సుందరంగా అలంకరించి పూజలు చేశారు.

గోదావరిలో స్నానాలకు అనుమతించ వద్దు

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు: గోదావరిలో వరద ఎక్కువగా ఉన్నందున నదిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు ఎవరినీ అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. పట్టణంలోని గోష్పాద క్షేత్రంలో గోదావరి వరద ఉధృతిని ఆదివారం కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. నదిలో స్నానాలకు దిగకుండా స్నాన ఘట్టాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. గోదావరి నదిలో వరద ఉధృతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తహసీల్దార్ కె.మస్తాన్, కమిషనర్ దానియేలు జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..



తాళ్లపాలెంలో బాధితులకు ఆహార ప్యాకెట్లు అందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ సభ్యులు

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ముంపుతో ఇళ్లకే పరిమితమైన బాధితులకు అండగా దాతలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు ఆరిఫ్‌ఖాన్ ఆర్థిక సాయంతో తాళ్లపాలెంలో ఆదివారం ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కొండేపాటి రామకృష్ణ, సభ్యులు నీరుకొండ సుబ్రహ్మణ్యం, బేతిన ప్రసాద్, బొల్లా శ్రీనివాస్‌గౌడ్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే నిడదవోలు కిరణా వర్తక సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేలు విలువచేసే పాలు, బిస్కెట్లు, తినుబండారాలను తాళ్లపాలెం సర్పంచ్ యర్రా రామకృష్ణకు అందజేశారు. కిరాణా సంఘం అధ్యక్షుడు బచ్చు సుమన్, కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, సత్యబాలాజీ, ఉప్పల నాగేశ్వరరావు, పేరూరి నాగు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

దేవరపల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజాసంఘాల నేతలు ఆరోపించారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో ఆదివారం సాయంత్రం ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేవరపల్లిలోని 14 ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గత నెలలో అధికారులకు, ఎమ్మెల్యేకు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. ఇంత వరకూ ఎవరూ స్పందించలేదన్నారు. గ్రామంలో ఆక్రమణల దందా పెరిగిపోతోందన్నారు. గ్రామంలో 11 ప్రధాన సమస్యలను గుర్తించినట్టు తెలిపారు. సమత సైనికదళ్ జిల్లా అధ్యక్షుడు మడతల శంకరం కూడా మాట్లాడారు. రజక సంఘం అధ్యక్షుడు కడెల్లి సుబ్బారావు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బొడ్డు వెంకట్రావు, సీపీఎం నాయకుడు కొత్తగుండ రత్నాజీ, పుల్లూరి వెంకటరత్నం, సూర్యచంద్రం పాల్గొన్నారు.

చెరువులు కావవి.. వరి పొలాలు

- రోజుల తరబడి ముంపులోనే..
- ఆశ వదిలేసుకుంటున్న అన్నదాతలు



చాగల్లు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పేముల కాలువ



తాళ్లపూడి మండలం రాగోలపల్లి- తాడిపూడి రోడ్డు పై నుంచి ప్రవహిస్తున్న కొవ్వాడ కాలువ వరద



నల్లజర్ల మండలం పోతవరంలో చెరువును తలపిస్తున్న పొలాలు



ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో నీట మునిగిన వరి చేలు



చాగల్లులో నీట మునిగిన పొలాలు

ఉండ్రాజవరం: భారీ వర్షాలు, ఎర్ర కాలువ వరద ఉధృతికి యనమదుర్రు డ్రైన్ పొంగి ప్రవహిస్తోంది. దాంతో మండలంలోని సూర్యారావుపాలెం, పసలపూడి, కాల్దారి గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల్లోని వరి నాట్లు నీట మునిగాయి. ఈ మూడు గ్రామాల్లో వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. గట్లను తాకుతూ యనమదుర్రు డ్రైన్ ప్రవహిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ డ్రైన్ గట్టు చాలాకాలంగా బలహీనంగా ఉంది. దాంతో ఏటా సార్వా సీజన్‌లో పంటలు ముంపు బారిన పడి రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది. వరిపంట రోజుల తరబడి నీటిలో ఉండడంతో కుళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పంట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కరం చూపాలని రైతులు కోరుతున్నారు.

12 రోజులుగా అదే ప్రవాహం

నల్లజర్ల: పోతవరం గ్రామంలోని సీతమ్మ ఆవ చెరువు ఆయకట్టు కింద సుమారు 200 ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. కొయ్యలగూడెం మండలం ఎర్రంపేట చెరువు పొంగి ప్రవహించడంతో ఆ వరద నీరంతా తమ గ్రామ ఆయకట్టును ముంచెత్తుతోందని పోతవరం రైతు నాయకుడు పెండ్యాల వీరరాఘవులు వివరించారు. గత 12 రోజులుగా గ్రామంలో వరద నీరు వస్తూనే ఉందని తెలిపారు. గత బుధ, గురు వారాల్లో కొంత తెరిపి ఇచ్చిందని నాట్లకు ఉపక్రమించే లోగా మళ్లీ వరదొచ్చి వచ్చితిష్ఠ వేస్తోందని రైతులు కరుటూరి వెంకటేశ్వరరావు, శ్రీధర్, సత్యనారాయణ తదితరులు వివరించారు. వరద నీరంతా దిగువకు పోయేందుకు గ్రామంలో ఏర్పాటు చేసిన బోదెను కొందరు ఆక్రమించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు.

కల్వర్టులపై నుంచి 'కొవ్వాడ' ప్రవాహం

తాళ్లపూడి: మండలంలో కొవ్వాడ కాలువ ప్రవాహ ఉధృతి ఆదివారం కూడా ఏమాత్రం తగ్గలేదు. కొవ్వాడ కాలువ వరద, వర్షాల వల్ల మండలంలోని 1,696 ఎకరాల్లోని వరి, చెరకు, కూరగాయల పంటలు ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి. రాగోలపల్లి నుంచి తాడిపూడి వైపు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు కల్వర్టుపై నుంచి, అన్నదేవరపేట నుంచి వేగేశ్వరపురం వైపునకు వెళ్లే కల్వర్టు పైనుంచి తిరుగుడుమెట్ట, వెంకటాయపాలెం వైపు వెళ్లే కల్వర్టులపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొవ్వాడ కాలువ వరదకు అన్నదేవరపేట గ్రామంలోని జాన్‌పేటలోని ఇళ్ల వద్దకు నీరు చేరింది. వర్షాలకు తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, తాళ్లపూడి, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో వరి చేలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. మరోపక్క గోదావరి నదిలో వరద పెరుగుతోంది. లంకలను తాకుతూ ప్రవహిస్తోంది.

పెరిగిన పేముల కాలువ ఉధృతి

చాగల్లు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలో పేముల కాలువ వరద ఉధృతి పెరిగింది. చాగల్లు–కుంకుడుమిల్లి, చాగల్లు–నందమూరు రహదారులపై సుమారు 3 అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాలువలో గుర్రపు డెక్క పేరుకుపోవడం నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు రావడంతో కాలువ ఉధృతి పెరుగుతోందని రైతులు చెబుతున్నారు. కాలువ పరీవాహక ప్రాంతాలైన నెలటూరు, చంద్రవరం, మల్లవరం, మార్కొండపాడు గ్రామాల పరిధిలో వేలాది ఎకరాల్లో పంటలు ఇప్పటికీ నీట మునిగి ఉన్నాయి.

ముంపు ప్రాంతాల్లో చైర్మన్ 'భూపతి' పర్యటన

నిడదవోలు: పట్టణ శివారు ప్రాంతాలైన తీరుగూడెం, సుబ్బరాజుపేటలను ఎర్ర కాలువ వరద చుట్టిముట్టింది. దీంతో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులు, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తీరుగూడెం, సుబ్బరాజుపేటలో పంట పొలాలు నీట మునిగాయి. ఆదివారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అక్కడి ప్రజలతో ఆయన మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తీరుగూడెంలో 50 మంది వరద బాధితులకు చైర్మన్ ఆదినారాయణ భోజన పొట్లాలు పంపిణీ చేశారు.వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్ సైదు చంద్రశేఖర్, గంగుల గోపీ యాదవ్ కమిషనర్ రాంభూల్‌రెడ్డి, ఏఈ హేమంత్ పాల్గొన్నారు.